ఎవరిని వరించేనో..!

- మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి తీవ్ర పోటీ
- పావులు కదుపుతున్న ఆశావహులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాన్ని ఈ సారి ఎస్సీ మహిళకు రిజర్వ్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు పలువురు ఆ పీఠంపై దృష్టి సారించడంతో పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. పార్టీలో వర్గాలు ఉండటంతో ఎవరికి వారు వేర్వేరుగా యత్నాలు చేస్తున్నారు. ఎలాగైనా సరే చైర్మన్ గిరిని సొంతం చేసుకోవాలనే ఆరాటంతో తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. దీంతో ప్రస్తుతం అందరి దృష్టి మార్కెట్ కమిటీ వైపు మళ్లగా, ఎవరికి చైర్మన్ పీఠం దక్కుతుందనే ఆరాటం కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తోంది. పార్టీకి విధేయులై ఉండటంతో పాటు శ్రేణులకు అండగా ఉండి ఏ సమస్య వచ్చినా, ముందుండి పరిష్కరించే నేర్పు, ఓర్పు ఉన్న సమర్థురాలైన మహిళ పేరును ప్రతిపాదించాలనే తలంపులో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కసరత్తు చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గీయులు పేర్కొంటున్నారు. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ గిరి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నిరాశకు గురైన నాయకులు..

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు మొదటి నుంచి ఎంతగానో ఆశలు పెంచుకున్నారు. ఎమ్మెల్యేగా వినోద్ గెలవగానే ఆ పదవి తనకు రావడం తథ్యమని భావించారు. ఇందుకోసం తమ అభిప్రాయాన్ని కొందరు ఎమ్మెల్యే చెవిలో పడేసినట్లుగా తెలుస్తోంది. అయితే ఆ నాయకుల ఆశలపై రిజర్వేషన్ అంశం నీళ్లు చల్లింది. ఈ దఫా మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాన్ని ఎస్సీ మహిళకు ఖరారైనట్లు ఉత్తర్వులు రావడంతో ఆశపడిన నాయకులు ఒక్కసారిగా నీరుగారి పోయారు. ఇదే క్రమంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుల్లో ఆశలు రేకెత్తాయి. ఆ పదవిని తమ భార్యలకు ఇప్పించుకోవాలనే తలంపుతో ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవడానికి యత్నాలు చేస్తుండటం చర్చనీయాంశమైంది.



బెల్లంపల్లి మార్కెట్ యార్డు ముఖ ద్వారం

ఆశావహులు అర డజనుకు పైనే...!

అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు బెల్లంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ మహిళ నాయకురాళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశించి భంగపడిన మహిళలతో పాటు పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్న మహిళలు కూడా చైర్మన్ పీఠం కోసం పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల భార్యలు, కుటుంబ సభ్యుల పేర్లు సైతం వినబడుతున్నాయి. ఎమ్మెల్యే ఇంతవరకు ఎవరి పేరును ఖరారు చేయకపోయినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో ఆశావహులు చైర్మన్ పీఠం తమదేనని ఎవరికివారు ప్రచారం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశించిన కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఒకరిద్దరు తమ భార్యలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుంచి కూడా కొందరు చైర్మన్ పదవిని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశవహుల జాబితా దినదినం పెరిగిపోతోంది.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే...!

పార్లమెంట్ ఎన్నికలు అతి త్వరలో జరగనున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్ అధిష్టానం ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇదే క్రమంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలకవర్గాన్ని ప్రకటించడం వల్ల పదవి దక్కని శ్రేణులు ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేసే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు ముగిసే వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్నీ ఎంపిక చేయకపోవడం సముచితంగా ఉంటుందని కొందరు ముఖ్య నాయకులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది.

ఏఎంసీ చైర్మన్ కోసం ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శారద

బెల్లంపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని తనకు ఇవ్వాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొడ్డ శారద ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కోరారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శారద, ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వు చేశారని, ఆ అవకాశాన్ని తనకు కల్పించాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యేకు సూచించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: తెలంగాణ మోడల్ స్కూల్లో అడ్మిషన్ల దరఖాస్తులకు ఈ నెల 22 ఆఖరు తేదీగా ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఆరో తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10తరగతులలో మిగులు సీట్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 22వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 7న ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని, దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) కార్యాలయం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(డీఏఓ)గా సుధాకర్, బెల్లంపల్లి మండల తహసీల్దార్‌గా కేవై .ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బెల్లంపల్లి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న సుధాకర్‌ను ఆర్డీవో కార్యాలయంలో డీఏఓగా నియమించగా, మంచిర్యాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను బెల్లంపల్లికి బదిలీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి తహసీల్దార్ పూలమొక్క అందజేశారు.

క్యాంపు కార్యాలయం సందర్శించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించారు. క్యాంపు కార్యాలయాన్ని నిశితంగా పరిశీలించి, తగు సూచనలు చేశారు. మరమ్మతు పనుల గురించి వాకబు చేశారు. కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.

అనుమతులు రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఖర్జీ గ్రామస్తులు

నెన్నెల: మండలంలోని ఖర్జీ, జంగాల్‌పేట వాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి ఇసుక తరలింపు అనుమతులను రద్దు చేయాలని జంగాల్‌పేట, ఖర్జీ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సబ్బ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. వాగులో రెండు ఎకరాల పరిధిలోనే అనుమతులు ఉండగా, అనుమతికి మించి ఇళ్ల పక్క నుంచే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఖర్జీ, జంగాల్‌పేట వాగు అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల సత్యనారాయణ, నాయకులు చింత మధుకర్, గొలుసుల మధునయ్య, చిలుకయ్య, సమ్మయ్య, గౌతమ్, తిరుపతిగౌడ్ ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

జన్నారం: ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రెండో ఎస్సై మృత్యుంజయ సర్కార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రోడ్డుభద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్నేహయూత్ అధ్యక్షుడు దుమల్ల రమేష్, సురేష్, ఎల్లయ్య, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వాడల్లో అప్రకటిత కరెంట్ కోతలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి కార్మిక వాడల్లో అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నారు. గంటల కొద్ది విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా కంపెనీ క్వార్టర్లకు ప్యూజ్‌కాల్ వస్తే సంబంధిత ప్రాంతంలో కరెంట్‌ను నిలిపివేసి పునఃరుద్దరణ చర్యలు చేపట్టడం ఆనవాయితీ. అయితే వేళా, పాళా లేకుండా కరెంట్ సరఫరా ఆపివేయడం సర్వసాధారణమైంది. కరెంట్‌ను నిలిపివేశాక కనీసం గంటకు పైగా సమయం గడిస్తే కానీ పునఃరుద్ధరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కంపెనీ క్వార్టర్ల కరెంట్ సరఫరా విషయంలో సింగరేణి విద్యుత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా కరెంట్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంస పత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

భీమిని: మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బెల్లంపల్లిలో నిర్వహించిన కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థిని శ్రీనిధి గోల్డ్‌మెడల్ సాధించగా, అంజలి సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, కరాటే మాస్టర్ రాజేష్ వారిని అభినందించి సన్మానించారు.

ఘనంగా మారమ్మ బోనాలు



బోనాల వద్ద మహిళలు

నెన్నెల: మండల కేంద్రంలోని మారమ్మ ఆలయంలో సోమవారం ఘనంగా మారమ్మ, లక్ష్మీ దేవరలకు గిరిజనులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండలు, బిందెలలో పాలు, నెయ్యి, కొత్త బియ్యంతో పాయసం వండి దేవుళ్లకు నైవేద్యం సమర్పించారు. బంతిపూలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని మారమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆడిపాడారు. గిరిజనులంతా ఇంటిల్లిపాది కదలిరావడంపై ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. ప్రతిఏటా ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికి వచ్చాక గిరిజనులు పెద్ద ఎత్తున బోనాల పండుగను జరుపుకుంటారు. నూతన వస్త్రాలు ధరించి గిరిజన మహిళలు సంప్రదాయంగా బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్

రామకృష్ణాపూర్: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సాహించాలన్న ఉద్దేశ్యంతోనే ప్రతీ సంవత్సరం తన తండ్రి వెంకటస్వామి పేరిట క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీల్లో భాగంగా పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో సోమవారం మంచిర్యాల నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది నైపుణ్యం గల క్రీడాకారులు ఉంటారని, అలాంటి వారిని వెలికితీసి ప్రోత్సాహించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని, క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఆర్‌కే 1ఏ గని సమీపంలో నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరతో పాటు గాంధారి ఖిల్లాలో నిర్వహించే మైసమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, పల్లెరాజు తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న వివేక్

దుబ్బుల కొలుపు కళాకారులను ఆదుకోవాలి

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నివసిస్తున్న దుబ్బుల కొలుపు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు బోయిరి లక్ష్మణ్ సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం ముద్రించిన క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నారాయణ, డివిజన్ అధ్యక్షుడు రాజేశ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్ రెడ్డి, నాయకులు పొడేటి రవి పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని నంనూర్‌లో దుబ్బు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జునుగరి దుర్గయ్య, జిల్లా అధ్యక్షుడు జునుగరి నారాయణ, కార్యదర్శి రాజ్‌కుమార్, హాజీపూర్ మండల అధ్యక్షుడు బోగిరి రాజ్ కుమార్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లిరూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండల పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ చేశారు. మండలంలోని బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, చాకేపల్లి గ్రామాల్లో రూ.60లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించే నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. లింగాపూర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాతబెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రూ.120కోట్ల నిధులతో నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు సూచించారు. అనంతరం ఇటీవల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూ సార పరీక్షలు నిర్వహించగా రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేను శాలువా, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో చాకేపల్లి ఎంపీటీసీ మహేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

బెల్లంపల్లి: రైలు ప్రయాణంలో బంగారు ఆభరణాలను కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. బెల్లంపల్లి మండలం బుధాకుర్ద్ గ్రామంలోని వైస్ ఎంపీపీ వెంబడి వాణి, సురేష్ దంపతులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెల్లంపల్లికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న 10తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసి తీసుకు వెళ్లినట్లు బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. వారికి ఆయన ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని అభయం ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్, ఎం.సూరిబాబు, బత్తుల రవి, ఏసీపీ రవికుమార్ ఉన్నారు.

'గ్రీవెన్స్'కు స్పందన కరువు

దండేపల్లి: మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి దండేపల్లిలో స్పందన కరువయ్యింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు తప్పా, అర్జీదారులు ఎవరూ రాలేదు. ప్రజావాణిలో ఇచ్చే సమస్యలు పరిష్కారం కావనే అపనమ్మకంతో అర్జీలు ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్జీదారులు ఇచ్చే సమస్యలను పరిష్కరించి, ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తే తప్పా, ప్రజావాణికి స్పందన వచ్చేలా లేదు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాధా రాథోడ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వారు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ఇందులో ఎంపీవో సతీష్ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రజావాణికి వెళ్లి ఎంపీఓ బాపురావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ కొండగొర్ల బాపు, గ్రామస్తులు రవి, మల్లేష్, ధర్మయ్య, మల్లయ్య ఉన్నారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

పాతమంచిర్యాల: ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో బహుజనులు సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి దుర్గం రామ్మూర్తి, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దేవి సత్యం, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, బీసీ ఐక్యవేదిక నాయకులు రామదాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి పోలు, సామాజిక సంఘాల నాయకులు పేర్కొన్నారు.

వేమనపల్లి: స్థానిక బస్టాండ్ వద్ద శివాజీ మహారాజ్ జయంతిని ఆరే కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఆరే కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుబిడె మధుకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మానేపల్లి సత్యనారాయణ, నాయకులు వెంకటేష్, చప్పిడె వెంకటేష్, రాజు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో గ్రామ యువత ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హిందువులలో ఐక్యమత్యాన్ని పెంపొందించి, హిందూ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప మహారాజు ఛత్రపతి మహారాజ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్, యోగోష్ణమి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామయ్య, తుల ఆంజనేయులు, శ్రీనాథ్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి, చంద్రకాంత్, అశోక్, సంపత్, విజయ్, వేణు పాల్గొన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని ఎర్రంశెట్టి సంతోశ్ కుమార్ 52వ సారి జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు.

– ఆదర్శ్ భారతీయ విభాగ్ ప్రముఖ్ హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ నుంచి పట్టణంలోని వీధుల గుండా భారీ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందూవాహిని లీగల్ అడ్వైజర్ కొట్టే నటేశ్వర్, ప్రదీప్ చంద్ర, తుల మధుసూదన్‌రావు, మున్నారాజ్ సిసోడియా, మండ శ్రీనివాస్, గుండ విజయ్ కుమార్, బోసు, సతీశ్, రవీందర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు

చెన్నూర్‌రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని నాగా పూర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. చండీ హోమం నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపల్లి శివాజీ, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చాప్లే రావుజి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుబిడే వెంకటేశ్వర్లు హాజరయ్యారు.



చెన్నూర్‌రూరల్: నాగపూర్‌లో విగ్రహావిష్కరణ



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు



పార్‌పల్లిలో...

చెన్నూర్: పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయులు వంశీకృష్ణ, బీజేపీ నాయకులు ఆలం బాపు, సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు కృష్ణలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

దండేపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్టు పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. పోటీల్లో కొర్విచెల్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అభిలాష్, వెల్గనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షయ ప్రథమ స్థానంలో నిలువగా, దండేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన జస్విత్, కొర్విచెల్మకు చెందిన సూర్యతేజ ద్వితీయ స్థానం సాధించారు.

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ టాలెంట్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భీమారం, నర్సింగాపూర్, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. భీమారం జెడ్పీ పాఠశాలలో వి.అంకిత(8వతరగతి), బి.ప్రణీత(9వతరగతి) జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెడ్మాస్టర్ విక్రమ్ తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఫిజికల్ సైన్స్, బయోలజికల్ సైన్స్‌లో నిర్వహించిన పరీక్షల్లో ధర్మరావుపేట జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన కావ్యశ్రీ, మోడల్ స్కూల్‌కు చెందిన టి.చంద్రహాసిని, ధర్మరావుపేటకు చెందిన రిషితలు ప్రతిభ కనబరచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు ఇద్దరు జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో కలమడుగు పాఠశాలకు చెందిన అంజనకుమార్ మొదటి బహుమతి, అశ్వక్ ఖాన్ రెండవ బహుమతి గెలుచుకున్నట్లు హెచ్‌ఎం కట్ట రాజమౌళి తెలిపారు. విద్యార్థులకు ఎంఈవో విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

బీజేపీ హాజీపూర్ మండల అధ్యక్షుడిగా స్వామిరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేస్తూ ఈ కమిటీ తక్షణమే అమలులోకి వస్తుందని తెలియజేశారు. హాజీపూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా గడ్డం స్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా మడిపెల్లి సత్యం, కోటె ప్రశాంత్, రాయెల్లి మల్లేశ్, ఉపాధ్యక్షులుగా బొడ్డు తిరుపతి, ఊట్నూరి రాయనర్స, దామెరకుంట నర్సయ్య, జూపాక ధర్మయ్య, కార్యదర్శులుగా గాదర్ల సతీశ్, చిందం తిరుపతి, ఆరెందుల రాజేశ్, తిప్పని కార్తిక్, అల్లంల ప్రదీప్ నియామకం అయ్యారు. యువమోర్చ మండల అధ్యక్షుడిగా చౌతకారి రాకేశ్, మహిళా మోర్చ మండల అధ్యక్షురాలిగా బొలిశెట్టి లలిత, బీసీ మోర్చ మండల అధ్యక్షుడిగా ఐలవేణి సతీశ్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడిగా హనుమాండ్ల శ్రీనివాస్ నియామకం అయ్యారు.